**ఈమధ్య గాంధీ హత్య కేసు గురించి చదువుతున్నప్పుడు అరెస్టయిన వారిలో శంకరకిష్టయ్య అనే తెలుగువాడు కూడా ఉన్నాడని తెలిసింది. కమల్‌హాసన్ హే రామ్ సినిమా తియ్యడానికి అతనే ఇన్‌స్పిరేషన్ అని కూడా తెలిసింది. అందుకే అతని గురించి పరిశోధన ప్రారంభించి, ఆ క్రమంలో నేను తెలుసుకున్న కొన్ని విషయాల ఆధారంగానే ఈ కథ.**

వెంకట్ శిద్దారెడ్డి

# 4

# 1948-డైరీలో కొన్ని పేజీలు

నర్సిం





## జనవరి 30, 1948

ఇప్పుడు రాత్రి పదకొండు దాటింది. మిగతా రోజుల్లో ఈపాటికి అందరూ నిద్రపోయుండేవాళ్లు. ఊరంతా నిశబ్దంగా ఉండేది. కానీ ఈరోజు వేరు. సాయంత్రానికి ఊరి జనమంతా రేడియో ఉన్న ఇళ్ల చుట్టూ మూగిపోయారు. అర్ధరాత్రి అవుతున్నా ఊర్లో ఎవరికీ నిద్రపట్టేలా లేదు.

సాయంత్రం ఆరు గంటలకు వచ్చిన బులెటిన్ విన్న కొంతమంది ద్వారా కొద్దిసేపట్లోనే ఆ విషయం ఊరు ఊరంతా తెలిసిపోయింది. రాత్రి పండిట్ నెహ్రూ తన ప్రసంగంలో ఆ వార్త నిజమే అని చెప్పేవరకూ అందరూ ఏవేవో కథనాలు అల్లుకున్నారు. ఊర్లో ఎక్కడ చూసినా జనాలు. అందరూ మాట్లాడుకునే విషయం ఒక్కటే- మహాత్మాగాంధీ హత్య.

పండిట్ నెహ్రూ ప్రసంగం మొదలవ్వగానే, అప్పటివరకూ మాట్లాడుతున్న వాళ్లు మాటలు ఆపేశారు. గాలి కూడా స్తంభించినట్టనిపించింది. చెట్లు, పక్షులు సైతం ఆ వార్త వినడానికి మౌనం వహించినట్టనిపించింది.

Friends and comrades, the light has gone out of our lives and there is darkness everywhere... our beloved leader, Bapu as we called him, the father of the nation is no more.

పండిట్జీ ఉద్వేగంతో చెప్తున్న మాటలు విన్నవాళ్లలో చాలామంది మౌనంగానే కన్నీళ్లు పెట్టుకున్నారు. కొంతమంది బిగ్గరగానే ఏడ్చేశారు.

నాకైతే ఇలాంటి మరొకరోజు గుర్తొచ్చింది.

పోయిన సంవత్సరం, ఆగస్ట్ 14న కూడా ఊరు ఊరంతా ఇలాగే మేల్కొని ఉంది. ఆరోజు కూడా ఇలాగే అందరూ రేడియోల చుట్టూ చేరారు. ఊరిలోని ప్రతి ఇంటి ముందు దీపావళి రోజులా దీపాలు వెలిగించారు. ప్రతి ఇంటి ముందు జెండాలు ఎగురవేశారు. రోడ్డు మీద నడుస్తూ వెళ్తుంటే అందరి చేతిలోనూ మిఠాయి పొట్లాలే!

On this day our first thoughts go to the architect of this freedom, the Father of our Nation, who, embodying the old spirit of India, held aloft the torch of freedom and lighted up the darkness that surrounded us.

గాంధీజీ గురించి ఆరోజు నెహ్రూ మాట్లాడుతుంటే నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఆయన మాటలకు ప్రభావితమై ఐదేళ్ల క్రితం క్విట్ ఇండియా అంటూ తిరిగిన రోజులు, జైల్లో గడిపిన రోజులు గుర్తుకొచ్చాయి.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని నెహ్రూ రేడియోలో ప్రకటించిన కొద్ది నిమిషాల తర్వాత స్నేహితులందరం జెండా పట్టుకుని రోడ్లన్నీ తిరుగుతూ, పాటలు పాడుతూ రాత్రంతా గడిపాం. ఆ రోజంతా ఆనందంతో నిద్ర పట్టలేదు.

ఈ రాత్రి కూడా దుఃఖంతో నిద్ర పట్టేలాలేదు.

అమ్మ చనిపోయిన దగ్గర్నుంచి మూలన పెట్టేసిన తంబురా తీసుకున్నాను. దుమ్ము పట్టిపోయుంది. శుభ్రం చేసి, శ్రుతి సరిచేశాను.

*వైష్ణవ జనతో తేనే కహియే*
*జే పీడ పరాయీ జాణే రే*

మహాత్ముని స్మృతిలో ఆయనకిష్టమైన పాట పాడుకుంటూ చాలాసేపు గడిపాను.

***ఫిబ్రవరి 10, 1948***

ఇవాళ ఎందుకో జీవితం చాలా ఒంటరిగా అనిపిస్తోంది.

అమ్మ ఉండుంటే ఈరోజు చాలా సంతోషపడేది.

నువ్వు చదువుకోవాలి. ఉద్యోగం చెయ్యాలి. నువ్వు నా వల్ల ఇలా ఇంట్లో ఉండిపోకూడదు. బయట ప్రపంచం చాలా పెద్దది. అందులో నీ స్థానాన్ని నువ్వు పొందాలి, అని ఎన్నిసార్లు చెప్పేదో అమ్మ.

ఉదయాన్నే బాబాయ్ వచ్చాడు. ఒక్కదానివే బొంబాయిలో ఎలా ఉంటావే అన్నాడు. చిన్నప్పుడే నాన్న పోయాడు. తర్వాత కొన్నేళ్లకు క్యాన్సర్తో అమ్మపోయింది. అప్పుడు కూడా నేను ఒక్కదాన్నే. అప్పుడు లేని అభిమానం ఇప్పుడు ఎందుకో వీళ్లందరికీ?

పెళ్లి చేసుకో. పాతికేళ్లు దాటాయి నీకు. అర్థమవుతుందో లేదో! అంది దూరపు చుట్టం ఒకావిడ.

అంత పెద్ద ఊర్లో ఒక్కదానివే ఎలా ఉంటావు?

అసలే రోజులు బాగోలేవు. కలకత్తాలో ఏమవుతుందో వార్తలు వినడం లేదా?

అయినా ఆడవాళ్లు ఉద్యోగం చేయడం ఏమిటో?

నా చుట్టూ ఉన్న వాళ్లకు నా గురించి ఎన్ని ప్రశ్నలో? అసలు ఈ ప్రశ్నలన్నీ నా గురించా? లేక వారి ఆకాంక్షలకు భిన్నంగా ఆలోచిస్తున్న నా వ్యక్తిత్వం వారిలో కలుగచేసిన అభద్రతాభావమా?

దేశానికి స్వాతంత్రం వచ్చింది. కానీ ఈ దేశంలోని స్త్రీలు తమ ఇష్టానుసారం తమ జీవితాలను కొనసాగించే స్వాతంత్రం ఎప్పుడొస్తుందో?

***ఫిబ్రవరి 13, 1948***

రాత్రి చీకటిని దూసుకుంటూ పరిగెడుతోంది రైలు. రైలు చేస్తున్న భారీ శబ్దాల్లో కూడా, నా గుండె చేస్తున్న చప్పుడు నాకు తెలుస్తోంది. బహుశా, ఇప్పుడు నేను ఉన్న ఉద్విగ్నభరిత సందర్భమే అందుకు కారణం అయ్యుండొచ్చు.

బొంబాయి నుంచి ఢిల్లీకి ఇప్పుడు నేను చేస్తున్న ఈ ప్రయాణం నా జీవితంలోని ఒక గొప్ప అనుభవంగా మిగిలిపోనుందని అనిపిస్తుంది. ఒకవైపు ఉత్సాహంగా ఉంది. మరొకవైపు చాలా దిగులుగానూ ఉంది.

ఇవాళ జరిగిన విషయాలు తల్చుకుంటే ఇదంతా కలలో జరిగినట్టే ఉంది. లేదా ఏదో కథలో జరిగినట్టు కూడా ఉంది.

సాయంత్రం మెజిస్ట్రేట్ ఆఫీస్ నుంచి బయటకొస్తుంటే, మేడం మేడం అన్న పిలుపు విని నన్ను కాదేమో అనుకున్నాను. కానీ ఆ పిలుస్తున్నది నన్నే అని తెలిసి మొదట భయమేసింది.

ఉద్యోగంలో చేరడానికి వస్తూ డొమిసైల్ సర్టిఫికేట్ తెచ్చుకోవాలని తెలియ లేదు. మళ్లీ ఊరికి వెళ్లి సర్టిఫికేట్ తెచ్చుకునేంత సమయం లేదు. నేను కంగారు పడిపోయాను. కానీ నా స్నేహితురాలు సుమతి ధైర్యం చెప్పడమే కాదు; ఉపాయం కూడా చెప్పింది. ఆస్కార్ బ్రౌన్ ఇక్కడే బొంబాయిలో మెజిస్ట్రేట్‌గా ఉన్నారని చెప్పడంతో నా భయం పోయింది.

ఆస్కార్ బ్రౌన్ నాకు పరిచయం లేకపోయినా, మా ఇంట్లో ఆయన పేరు చాలాసార్లు విన్నాను. అందుకే ధైర్యంగా ఆయన్ని కలవడానికి వెళ్లాను. నేను బళ్లారి నుంచి వచ్చానని చెప్పగానే ఆయన కబుర్లు మొదలుపెట్టేశారు. కొంచెం తెలుగు, కొంచెం కన్నడ పదాలు వాడుతూ మాట్లాడుతుంటే ఆశ్చర్యంగా అనిపించింది.

ఇప్పుడు ఊరు ఎలా ఉంది? ఫలానా వ్యక్తి ఎలా ఉన్నాడు? ఆ చోటు ఇప్పుడు ఎలా ఉంది? అని నన్ను ప్రశ్నలతో ముంచెత్తాడు. చాలాసేపు మాట్లాడాక, నా ఉద్యోగం సంగతి, నాకు అవసరమైన సర్టిఫికెట్ గురించి చెప్పాను. అదేమంత పెద్దపని కాదని, తన ఆఫీస్‌లో పనిచేసే వాళ్లకి చెప్పి వెంటనే నాకు డొమిసైల్ సర్టిఫికెట్ వచ్చేలా చేశారు.

స్వతంత్ర భారతదేశం ప్రగతి సాధించాలంటే నీలాంటి ధైర్యమైన మహిళలే కావాలని అంటుంటే, నాకు ఏం చెప్పాలో తెలియక, కృతజ్ఞతలు తెలియచేసి ఆఫీస్ నుంచి బయటికొస్తుంటే, సాబ్ మిమ్మలని రమ్మంటున్నారని ఒక వ్యక్తి వచ్చి చెప్పడంతో, ఏదో తెలియని భయంతో తిరిగి బ్రౌన్‌గారి ఆఫీస్‌లోకి అడుగు పెట్టాను.

బ్రౌన్ చెప్పిన విషయం విని చాలా ఆశ్చర్యపోయాను. గాంధీజీని చంపడానికి ప్లాన్ చేసిన వారిలో ఒక తెలుగువాడు కూడా ఉన్నాడని చెప్పారు ఆయన. అతని పేరు శంకర్. అతనికి తెలుగు తప్ప మరొక భాష రాకపోవడంతో ఢిల్లీ పోలీసులకు అతన్ని దర్యాప్తు చేయడం కష్టమైపోయిందని చెప్పారు బ్రౌన్. ఆ విషయంలో నా సహాయం అడిగారు. ఒప్పుకోవాలా లేదా అనే సమస్య లేదు నాకు. ఒప్పుకోకుండా ఉండడానికి ఒక్క కారణం కూడా కనిపించలేదు. గాంధీ మహాత్ముని చంపిన వారికి శిక్ష పడడంలో నా వంతు సహాయం చేయడం నా బాధ్యత అని కూడా అనిపించింది. అంతే కాకుండా, నేను చేరాల్సిన ఉద్యోగం గురించి ఆలోచించవద్దని, మాట్లాడాల్సిన వాళ్లతో మాట్లాడి తను చూసుకుంటానని ధైర్యం చెప్పారు బ్రౌన్.

నేను ఒప్పుకున్న వెంటనే, తన మనిషిని మా బంధువుల ఇంటికి పంపించి నా సామాన్లు రైలు స్టేషన్‌కి తెప్పించి నన్ను ఢిల్లీకి వెళ్లే ట్రైన్ ఎక్కించారు.

జీవితం మన నియంత్రణలో ఉందనుకుంటాం. ఇవాళ జరిగిన విషయాలన్నీ తలుచుకుంటే జీవితం మనల్ని ఎన్ని ఆశ్చర్యాలకు గురిచేస్తుందో కదా అనిపిస్తోంది.

వెళ్లడానికైతే ఒప్పుకున్నాను కానీ, అసలు నేనీపని చేయగలనా? ఆ శంకర్ అనే వ్యక్తి నాతో సహకరిస్తాడా? తెలుగు తప్ప ఏ భాషా తెలియని శంకర్ అసలు ఢిల్లీ ఎలా వెళ్లాడు? గాంధీని ఎందుకు చంపాలనుకున్నాడు?

రైలు బయట చుట్టూ ముసిరిన చీకటి. మనసు లోపల ముసురుకుంటున్న ప్రశ్నలు.

*ఫిబ్రవరి 15, 1948*

మనుషుల ముఖకవళికలు విశ్వవ్యాప్తమని సూచించిన మొదటి వ్యక్తి డార్విన్. భావోద్వేగాలు, వాటి వ్యక్తీకరణలు మనుషులందరిలోనూ ఒకేరకంగా ఉంటాయని సైకాలజీ టెక్స్ట్ బుక్స్‌లో చదువుకున్నది నిజమే! Emotion is the basis of human motivation and that the seat of emotion is in the face- అని కూడా పుస్తకాల్లో చదువుకున్నాను.

కానీ ఈరోజు మొదటిసారిగా శంకర్‌ని కలిసినప్పుడు నాకీ విషయాలేవీ గుర్తుకు రాలేదు. గుర్తుకొచ్చినా కూడా, ఏ భావోద్వేగం లేని అతని మొహం వైపే చూస్తూ చాలాసేపు మౌనంగా ఉండిపోయాను.

నాకు కేటాయించిన ఒక గదిలో శంకర్ కోసం ఎదురుచూస్తూ ఉండగా నాలోపల ఉన్న కోపమంతా అతన్ని చూడగానే మాయమయింది.

"మీ పేరు శంకర్ కిష్టయ్యా?" అని అడిగాను.

నా నోట్లోనుంచి వచ్చిన తెలుగు పదాలు చూసి మొదటిసారి అతని మొహం ఉద్వేగభరితమైంది. కళ్లల్లో నుంచి నీళ్లు పొంగుకొచ్చాయి.

"లేదమ్మా. ఉత్త శంకర్, కిష్టయ్య మా నాయన పేరు," అన్నాడు కళ్ల నీళ్లు తుడుచుకుంటూ.

అతని కళ్లల్లో భయం తెలుస్తున్నా, చాలారోజుల తర్వాత తెలుగులో మాట్లాడే నన్ను చూసిన మెరుపు కూడా కొంత తెలుస్తోంది. బహుశా మనసులో ఆశలు రేపిన వెలుగేమో అది!

శంకర్‌ది సోలాపూర్ దగ్గర ఒక పల్లెటూరు. ఒక నిరుపేద కంసాలి కుటుంబంలో పుట్టాడు. తండ్రి చిన్నప్పుడే చనిపోవడంతో ఊర్లో కొలిమి పనులు చేస్తూ ఒకరోజు తింటూ, ఒకరోజు పస్తులుంటూ బతుకుతుండేవాడు. తల్లి కూలికి వెళ్లి సంపాదించింది, తండ్రి చేసిన అప్పులు తీర్చడానికి సరిపోయేది. కష్టమో నష్టమో అని బతుకుబండిని ఎలాగో లాగుతున్న కోట్లాదిమంది భారతీయుల్లో ఒకడు. అతి సామాన్యుడు. అదంతా దిగంబర్ బాడ్గే అతని జీవితంలోకి రానంతవరకే! దిగంబర్ బాడ్గే పరిచయం తర్వాత శంకర్ జీవితపు పగ్గాలు చేతులు మారాయి; అవి దిగంబర్ బాడ్గే చేతుల్లోకి వచ్చాయి.

పూణే పట్టణంలో శాస్త్ర భండార్ పేరుతో నడుపుతున్న ఆయుధాల దుకాణం యజమాని దిగంబర్ బాడ్గే. పూణే నుంచి తెచ్చిన బాకులకు పిడి బిగించే కంసాలి

వాళ్ల కోసం వెతుకుతున్న బాడ్గేకి మొదటిసారి పరిచయమయ్యాడు శంకర్. బాడ్గే కోరినట్టుగానే పనిచేసి పెట్టాడు శంకర్. వాళ్లిద్దరినీ పరిచయం చేసిన శంకర్ ఊరి వాడు ఒకాయన చెప్పిన మాట ప్రకారం శంకర్‌ని పనిలో కుదుర్చుకుని, నెలకు 20 రూపాయల జీతమిస్తానంటూ శంకర్‌ని పూణేకి తీసుకొచ్చాడు. రిక్షా కొనిచ్చాడు. ఆ రిక్షాలో రోజంతా తిరగడం, సాయంత్రం ఎప్పుడో ఇంత అన్నం పెట్టేవాడు. ఎప్పుడైనా బుద్ధి పుడితే కొంత డబ్బులిచ్చేవాడు. అంతే తప్ప ఇస్తానన్న 20 రూపాయల నెలజీతం ఎప్పుడూ ఇవ్వలేదు.

శంకర్ చెప్పింది విని నాకు జాలేసింది అతనిమీద.

లేనివాడంటే ఉన్నవాడికి ఎప్పుడూ లోకువే!

***ఫిబ్రవరి 25, 1948***

శంకర్‌తో నేను మాట్లాడడం మొదలుపెట్టి వారం రోజులయింది. ఇప్పుడు అతను నాతో బాగానే మాట్లాడుతున్నాడు. మొదట్లో ఉన్న భయం లేదు.

ఇక్కడున్న మిగతావాళ్లు మొదట్లో నాతో అందరూ బాగానే ఉండేవారు. కొన్ని రోజుల్నుంచీ ఇక్కడున్న వారి కళ్లల్లో నామీద అనుమానం కనిపిస్తోంది.

ఈ కేసులో అరెస్ట్ చేసింది ఏడుమందినే అయినా, ఇంకా చాలామంది మహాత్మాగాంధీని హత్య చేసే ప్లాన్‌లో పాలుపంచుకుని ఉండొచ్చని నేను పోలీసులకు తెలియచేశాను. శంకర్ చెప్పిన విషయాల ప్రకారం వారి పేర్లు తెలియదు కానీ మరింత విస్తృతంగా విచారణ జరపాలని నేను చెప్పినందుకే నామీద ఈ అనుమానం అని అర్థమైంది.

ఇవాళ దిగంబర్ బాడ్గే అప్రూవర్‌గా మారి కేసు విషయాలన్నీ బయట పెడ్తానని, అందుకు ప్రతిగా తనకు శిక్ష తగ్గించాలని పోలీసులతో బేరానికి వచ్చాడు

దిగంబర్ బాడ్గేని చూస్తే నాకు చిన్నప్పుడు మా నానమ్మ చెప్పిన మాయల ఫకీరు కథ గుర్తొచ్చింది. అతని గురించి శంకర్ చెప్పిన విషయాలు విన్నప్పుడు అతను నిజంగానే మాయల ఫకీర్ అని కూడా అనిపించింది.

పొడువాటి జుట్టు, అంతే పొడుగ్గా గడ్డం.

మా సాబ్ గడ్డంలో తుపాకీ దాచిపెట్టగలడు అని చెప్పాడు శంకర్.

గడ్డంలోనే కాదు, తలపాగాలో, తబలాలో కూడా తుపాకీలు దాచిపెట్టి, ఒకసారి సాధువుగా, మరొకసారి సంగీత విద్వాంసుడిగా అవతారమెత్తేవాడట దిగంబర్.

ఇవాళ దిగంబర్ బాడ్గేతో మాట్లాడే అవకాశం వచ్చింది.

'ఆ శంకర్‌గాడు చెప్పేవి ఏవీ నమ్మకండి. వాడికి తలాతోకా తెలియదు. మీకేమైనా కావాలంటే నన్నడగండి. ఎలాగూ అప్రూవర్‌గా మారిపోయాను. ఏక్ దమ్ కుల్లంకుల్లా బోల్ దేతా,' అన్నాడు.

*మార్చ్ 5, 1948*

ఇవాళ గాంధీ హత్య కేసులో నిందితులుగా నిర్బంధించిన అందరినీ ఒకే చోట చూశాను. వారి నవ్వు మొహాలు చూస్తే వారు అసలు నేరమేమీ చేయనట్టే ఉన్నారు. గాంధీని హత్య చేయడం కూడా రోజూ తాము చేసే ఎన్నో పనుల్లో ఒకటైనట్టు, ఎటువంటి అపరాధభావన లేని వారిని చూసి ఆశ్చర్యం కలిగింది. వారందరి మధ్య శంకర్‌ని చూసిన ఎవరైనా అతను అమాయకుడు అని ఇట్టే చెప్పొచ్చు. నిండా ఇరవై ఏళ్లైనా ఉంటాయో లేదో పాపం అతనికి.

ఇదంతా మన కర్మఫలం. ఎక్కడో పూణేలో నా వ్యాపారం నేను చేసుకుంటున్నాను. మరెక్కడో నైజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్న హిందూ మహాసభ సభ్యులు. వారికి ఆయుధాలు సరఫరా చేయడం ద్వారా నాకు వీళ్లలో కొంతమంది పరిచయం. శంకర్ కూడా అలాగే పరిచయం అయ్యాడు. ఎక్కడో పాకిస్తాన్‌లో ఉండాల్సిన మదన్‌లాల్ మమ్మల్ని ఎలా కలిసాడు? ఎక్కడో దక్షిణాదిలో ఉండే మీరు ఈ కేస్ విచారణలో ఎలా పాల్గొన్నారు? ఇదంతా మన విధి. మన మందరం కలవాలని రాసిపెట్టుంది. అందుకే మనం కలిసాం అంటాడు దిగంబర్.

దిగంబర్ ఒక్కోసారి ఇలా వేదాంతధోరణిలో మాట్లాడుతాడు. ఇంకోసారి పూర్తి వ్యతిరేకంగా మాట్లాడుతాడు. తనకు కావాల్సిందల్లా డబ్బు. ఈ ప్రపంచాన్ని శాసించేది డబ్బు మాత్రమే. ఆ డబ్బు సంపాదించడానికే ఇన్ని వేషాలు అంటాడు మరొకసారి.

మా సైకాలజీ క్లాసులో ఇలాంటి ప్రవర్తన కలిగి ఉండడాన్ని డబ్లింగ్ అంటారు అని చదివిన విషయాలు గుర్తొచ్చాయి. ఇలాంటి ద్వంద్వ స్వభావం కలిగినవాడు కాబట్టే, దిగంబర్ అప్రూవర్‌గా మారాడనిపించింది. శంకర్ విషయంలో కూడా దిగంబర్‌ది ఇలాంటి వైఖరే. నిన్న మధ్యాహ్నం మా అందరి ముందే శంకర్‌ని చెంపదెబ్బ కొట్టాడు. మళ్లీ కాసేపట్లోనే తనకోసం తెప్పించిన స్పెషల్ భోజనం తినమని శంకర్‌ని బలవంతపెట్టాడు.

ఒకరోజు బాగా చూసుకుంటాడు. నెలరోజులు కోపంగా ఉంటాడు. దిగంబర్ బాడ్గే స్వభావమే అంతేనని శంకర్ చెప్పాడు. పోయిన సంవత్సరం ఈయన పెట్టే బాధలు భరించలేక శంకర్ తన ఊరికి వెళ్లిపోయాడు. అసలే చాలీచాలక బతుకుతున్న శంకర్ వాళ్ల అమ్మకి అతను ఊరికి తిరిగి రావడం ఇష్టంలేదు. శంకర్‌తోపాటే రైల్లో పూణే వచ్చింది. అప్పటికే శంకర్ మీద పోలీసు ఠాణాలో కేసు పెట్టాడు దిగంబర్. తన బీరువాలో ఉన్న మూడొందల రూపాయలు దొంగతనం చేసి పారిపోయాడనేది అభియోగం. పోలీసులు శంకర్‌ని అరెస్ట్ చేస్తే, దిగంబర్ కాళ్లా వేళ్లా పడి పోలీసుల దగ్గర్నుంచి విడిపించి, తిరిగి అతని దగ్గరే శంకర్‌ని నెలకి ముప్పై రూపాయల జీతానికి కుదిర్చింది వాళ్ల అమ్మ.

శంకర్‌ని చూస్తే రోజురోజుకీ జాలి ఎక్కువవుతోంది.

***మార్చ్ 10, 1948***

గాంధీ హత్య కేసులో నిందితులుగా నాథూరామ్ గోడ్సే, నారాయణ్ ఆప్టే, విష్ణు కార్కరే, మదన్‌లాల్ పహ్వా, గోపాల్ గోడ్సే, సావర్కర్, దత్తాత్రేయ్ పర్చురే ఇంకా శంకర్ కిష్టయ్యలను పేర్కొన్నారు. అప్రూవర్‌గా మారినందుకు దిగంబర్‌ను ఈ లిస్ట్‌లో చేర్చలేదు.

నాథూరాం మొదట్నుంచి, నేనే గాంధీని చంపాను అని అందరిముందే గట్టిగా, గర్వంగా ఒప్పుకుంటున్నాడు. అంతటితో ఆగకుండా తను గాంధీని ఎందుకు చంపానో అని కూడా చెప్పుకుంటున్నాడు. గాంధీ వల్లే భారతదేశం రెండుగా చీలిపోయిందని గోడ్సే అభిప్రాయం. హిందువులకంటే, ముస్లింల వైపు గాంధీ మొగ్గు చూపారని అతనికి గాంధీ మీద కోపం. అతను మాట్లాడే ప్రతి మాటలోనూ ఈ విషయం వ్యక్తమవుతోంది. అయితే నాకు అతన్ని ఒక ప్రశ్న అడగాలని ఉంది.

గాంధీని చంపడం ద్వారా మీరు సాధించింది ఏమిటి? బహుశా, ఈ ప్రశ్న అడిగే ధైర్యం నాకు లేదేమో! అడిగినా వారి సమాధానాలు నాకు రుచించకపోవచ్చు కూడా! కానీ సైకాలజీ చదివిన విద్యార్థిగా, హింసకు వ్యతిరేకంగా మనలో ఉన్న అంతర్గత సంయమనాన్ని గోడ్సే ఎలా అధిగమించాడో తెలుసుకోవాలని ఉంది.

గోడ్సే తను నమ్మిన సిద్ధాంతాల మీద గట్టి నమ్మకం ఉన్నవాడు. నమ్మకం అనేది చాలా విచిత్రమైనది. అది మనుషుల చేత వింతైన పనులను చేయిస్తుంది. ఆ నమ్మకమే మనలో ఒక నైతిక చట్రాన్ని నిర్మిస్తుంది. మన ప్రాధాన్యతలను

నిర్దేశిస్తుంది. నమ్మకం అనేది చాలా వినాశకరమైనది. అది మనలో పక్షపాతవైఖరిని వ్యక్తపరుస్తుంది. మనము-వాళ్లు అని మనుషుల్ని వేరుచేసేలా చూస్తుంది. నమ్మకాన్ని మించిన మారణాయుధం మరొకటి ఉండదేమో! రానున్న కాలంలో ఇలాంటి విపరీతధోరణి కలిగిన వారి చేతుల్లో ఈ దేశం పడకూడదని ఈ రాత్రి నేను ప్రార్థన చేస్తున్నాను.

***ఏప్రిల్ 4, 1948***

కేసు రోజురోజుకీ క్లిష్టమవుతోంది. ఇంకో రెండు నెలల్లో కేసు కోర్టులో విచారణకు రానుందని అందరూ అనుకుంటున్నారు.

మహాత్ముణ్ణి గోడ్సే చంపాడని అందరికీ తెలిసిన విషయమే! కానీ అతనికి సహకరించిన వాళ్ల గురించే అసలు సమస్య. అందరూ మాకే సంబంధం లేదంటున్నారు. ఈ కేసులో నిందితులకు ఉరిశిక్ష ఖాయం అని అందరి నోటా వినిపిస్తోంది. ఈ విషయం శంకర్ చెవిలో కూడా పడింది. బాగా కంగారుపడిపోతున్నాడు.

గాంధీని గోడ్సే హత్య చేసింది జనవరి 30న అని ఈరోజు ప్రపంచానికి మొత్తం తెలిసిన విషయమే. కానీ అంతకు పదిరోజుల ముందే గోడ్సే, ఇంకా కొంతమంది గాంధీని హత్య చేయడానికి చాలా పెద్ద పథకమే పన్నారు. అందులో భాగంగా శంకర్‌కి తుపాకీ పేల్చడం నేర్పించారని ఇవాళే తెలిసింది.

జనవరి 20న గాంధీ మీద చేసిన హత్యా ప్రయత్నం గురించి శంకర్ అంతా చెప్పాడు. పంతొమ్మిదో తేదీ పూణే నుంచి ఢిల్లీకి చేరుకున్నారు దిగంబర్ ఇంకా శంకర్. ఆరోజు రాత్రి అందరూ ఒక గదిలో కలుసుకున్నారు. గోడ్సే అందరికీ తను అనుకున్న ప్లాన్ వివరించాడు. కానీ గోడ్సే చెప్పింది ఒక్క ముక్క కూడా శంకర్‌కి అర్థంకాలేదు. ఆ తర్వాత దిగంబర్ వచ్చీరాని తెలుగులో శంకర్‌కి ప్లానంతా వివరించాడు.

ఇరవయ్యో తేదీ సాయంత్రం గాంధీ ప్రార్థన చేసే సమయంలో మదన్‌లాల్ కొంచెం దూరంగా ఉండి ఒక బాంబు పేలుస్తాడు. ఆ బాంబు పేలుడు జరిగిన హడావిడిలో శంకర్, దిగంబర్ ఇద్దరూ చెరొక హ్యాండ్ గ్రనేడ్ జనాల్లోకి విసిరి గాంధీ దగ్గరకు చేరుకుని పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో షూట్ చెయ్యాలనేది ప్లాన్. కానీ సమస్య ఏంటంటే శంకర్‌కి గాంధీ ఎవరో తెలియదు. నీకేం తెలియాల్సిన అవసరం లేదు. నేను గ్రనేడ్ విసుర్తాను. అప్పుడు నువ్వు కూడా విసురు. నేనొక

వ్యక్తిని తుపాకీతో కాలుస్తాను. నువ్వు కూడా అతన్ని కాల్చాలి అని దిగంబర్ శంకర్‌కి వివరించాడు.

కానీ జనవరి 20న వాళ్లనుకున్నట్టు జరగలేదు. మదన్‌లాల్ బాంబయితే పేల్చాడు కానీ, మిగిలిన వాళ్లు అక్కడ్నుంచి పారిపోయారు.

శంకర్ ఆరోజే గాంధీని మొదటిసారి చూశాడు. అసలు ఆ ముసలాయన్ని వీళ్లంతా ఎందుకు చంపాలనుకుంటున్నారో శంకర్‌కి అర్థం కాలేదు. అందుకే నన్ను అదే ప్రశ్న అడిగాడు.

"గాంధీని వీళ్లెందుకు చంపాలనుకున్నారు?"

"ఆయన వల్ల మనదేశానికి స్వాతంత్రం వచ్చింది, అందుకు."

"స్వాతంత్రం అంటే ఏంటమ్మా?" అడిగాడు శంకర్.

అప్పటివరకూ నాకు తెలిసిన శంకర్ వేరు. అమాయకంగా స్వాతంత్రం అంటే ఏంటి అని అడిగిన శంకర్ వేరు.

అప్పుడే నేను ఒక నిశ్చయానికి వచ్చాను. అమాయకుడైన శంకర్‌కి ఈ కేసులో శిక్ష పడకూడదు అనుకున్నాను.

*ఏప్రిల్ 10, 1948*

నేను వచ్చిన పని చివరిదశకు వస్తోంది.

శంకర్ చెప్పిన అన్ని విషయాలను నేను ఒకచోట చేర్చి రిపోర్ట్ సబ్మిట్ చేశాను. కేసు విచారణ ఎర్రకోటలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కోర్ట్‌లో జరుగుతుందని చెప్తున్నారు.

శంకర్ ఇప్పుడు కొద్దిగా హిందీలో మాట్లాడుతున్నాడు. ఇదంతా దిగంబర్ ఇచ్చిన ప్రత్యేక శిక్షణ అని నాకు అర్థమయింది. ముఖ్యంగా సావర్కర్‌కి ఈ కేసులో ఏ సంబంధం లేదు అని నిరూపించడానికి చాలామంది న్యాయవాదులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని అందరికీ అర్థమవుతోంది. ఈ విషయం గురించే దిగంబర్ చెప్పిందే చెప్తున్నాడు. అందుకే శంకర్‌కి కూడా ఈ విషయంలో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చాడు.

ఏదేమైనా, గాంధీ ఎవరో తెలియని ఒక అమాయకుడు, స్వాతంత్రం అంటే ఏంటో తెలియని ఒక సామాన్యుడు శంకర్.

ఇన్నాళ్లూ బ్రిటీష్ వారి బానిసత్వపు చెరలో చిక్కుకున్న భారతదేశం ఇప్పుడు స్వతంత్రదేశం. కానీ ఈ స్వాతంత్రం యొక్క ప్రయోజనాలు శంకర్‌లాంటి సామాన్యుడికి చేరడానికి ఇంకా ఎన్ని రోజులు పడ్తుందో అనే ప్రశ్న నన్ను ఎంతో ఆందోళనకు గురిచేస్తోంది.

సావర్కర్ వంటి పేరున్న వ్యక్తి పాత్ర ఈ కేసులో ఉందోలేదో అని నిర్ణయించే హక్కు, జ్ఞానం నాకు ఉందని నేననుకోవడంలేదు. కానీ ఆయన్ని ఈ కేసులోంచి బయటపడేయడానికి ఎంతోమంది కృషి చేస్తున్నారు. అదే సామాన్యుడైన శంకర్ గురించి ఎవరికీ పట్టింపులేదు. అతను ఉన్నా పోయినా ఒకటే అనే వీళ్లందరి వైఖరి చూస్తే నాకు కోపం వస్తోంది.

***జూన్ 23, 1948***

ఇవాళ చాలా ఉదయాన్నే నిద్రలేచాను.

రాత్రంతా నిద్ర పట్టలేదు. ఢిల్లీ వదిలి వెళ్తున్నానంటే ఏదోలా ఉంది. కోర్టులో కేసు విచారణ జరుగుతోంది. ఎటువంటి తీర్పు ఇస్తారో అని ఆందోళనగా ఉంది. దాదాపు నిర్ణయం అయిపోయింది- గోడ్సేకి, నారాయణ్‌కి ఉరిశిక్ష తప్పదు అని అందరి అభిప్రాయం.

నేను రేపట్నుంచి నిన్ను కలవలేనేమో అని శంకర్‌కి చెప్పాను. అతని కళ్లల్లో నీళ్లు చూసి నాకూ ఏడుపొచ్చింది. పాపం శంకర్ ఈ కేసు నుంచి బయటపడితే చాలు.

***ఆగస్ట్ 15, 1948***

దేశానికి స్వాతంత్రం వచ్చి అప్పుడే సంవత్సరం అయిపోయింది. ఈ సంవత్సరం రోజుల్లో ఎన్నో కొత్త అనుభవాలు.

రాబోయే జీవితంలో ఇంకా ఎన్నో కొత్త అనుభవాలు నాకు ఎదురవ్వొచ్చు. కానీ దాదాపు ఆరు నెలలపాటు ఢిల్లీలో నేను గడిపిన రోజులు మాత్రం నాకు జీవితంలో ఎంతో పెద్ద పాఠాన్ని నేర్పించాయి.

ఇవాళే కిప్లింగ్ నవల కిమ్ చదువుతున్నాను. శంకర్, దిగంబర్ బాడ్గే ఆ నవల్లో నుంచి నడిచొచ్చిన పాత్రల్లా అనిపించారు.

శంకర్‌కి ఎటువంటి శిక్ష పడుతుందో అని దిగులు. కేసు గురించి ప్రతి రోజూ నేను వార్తలు చదువుతూనే ఉన్నాను.

*మార్చి 1, 1949*

ఉద్యోగంలో చేరిన దగ్గర్నుంచీ డైరీ రాసే అలవాటు తప్పింది.

గత నెలలో గాంధీజీ హత్య కేసులో వెలువరించిన తీర్పు విని నేను తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. నేను పడ్డ శ్రమంతా వృధా అయ్యిందే అని నిరాశ, నిస్పృహ. మనసేం బావుండడం లేదు ఈమధ్య.

పోయినవారం లైబ్రరీ నుంచి క్రైం ఎండ్ పనిష్మెంట్ తెచ్చుకున్నాను. చదువుతూ ఒక వాక్యం దగ్గర ఆగిపోయాను.

She said nothing, she only looked at me without a word. But it hurts more, it hurts more when they don't blame!

ఎక్కడికి వెళ్లినా, ఏం చేస్తున్నా శంకర్ నా ఎదురుగా నిలబడి నా వైపే మౌనంగా చూస్తున్నట్టనిపిస్తోంది.

శంకర్‌కి యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. సావర్కర్‌కి ఈ కేసులో ఏ సంబంధం లేదని వదిలేశారు. అప్రూవర్‌గా మారినందుకు బాడ్గే తప్పించుకున్నాడు. శంకర్‌కి శిక్ష పడడం ఘోరమైన అన్యాయం. ఒక్కోసారి అన్యాయాన్ని నివారించే శక్తి మనకి ఉండకపోవచ్చు. కానీ ఆ అన్యాయాన్ని నిరసించే సమయం, సందర్భం ఎప్పుడూ మన చేతుల్లోనే ఉంటుంది.

పాపం శంకర్. శంకర్‌కి ఏదైనా చెయ్యాలి.

అర్ధరాత్రి. చుట్టూ చీకటి. దూరంగా ఎక్కడో చిన్న గుడ్డి దీపపు కాంతిలా వెలుగు.

నాకు బ్రౌన్ గుర్తుకొచ్చాడు. రేపు ఆయనకు ఫోన్ చేసి మాట్లాడాలి.

*ఏప్రిల్ 11, 1949*

ఇవాళ ఆఫీస్‌లో ఉండగా ఫోనొచ్చింది. అవతలి వైపు ఆస్కార్ బ్రౌన్. శంకర్ తరుపున హైకోర్టులో పిటిషన్ వేశారని చెప్పాడు. బహుశా శంకర్ నిర్దోషిగా బయట పడవచ్చని కూడా చెప్పారు. అదే జరిగితే నాకంటే సంతోషపడేవాళ్లు ఎవరూ ఉండరు.

శంకర్‌లాంటి ఎందరో అమాయకులు, రాబోయే కాలంలో ఇలాంటి పరిస్థితుల్లో చిక్కుకోక తప్పదు. పేదరికం, చదువు లేకపోవడంలాంటి పరిస్థితుల వల్ల ఎంతోమంది అమాయకులను వారికి తెలియకుండానే నేరస్థులుగా మార్చే

వ్యవస్థ మన కళ్లముందే రూపుదిద్దుకుంటోంది. ఇటువంటి పరిస్థితుల నుంచి విముక్తి పొందినరోజే ఈ దేశానికి నిజమైన స్వాతంత్రం వస్తుంది.

చరిత్రలో శంకర్, సన్నాఫ్ కిష్టయ్య అనే తెలుగువాడి గురించి, అతని విషాదం గురించి ఎక్కడా రికార్డ్ కాకపోవచ్చు. యుద్ధాల్లో మరణించిన ఎందరో సైనికుల్లాగే, అతనూ ఈ యుద్ధంలో గాయపడ్డ ఒక క్షతగాత్రుడు మాత్రమే!

ఏదేమైనా శంకర్ గురించి విన్న శుభవార్త వల్ల, చాలారోజుల తర్వాత నా మనసుకి చాలా ప్రశాంతంగా అనిపించింది.

"Well, I believe in miracles, so it comes to."

-Rudyard Kipling (Kim)

*సాయి పాపినేని సౌజన్యంతో*
*కాలయంత్రం-2020 కథల సంకలనం నుండి*
*మే, 2021*

*




29 డిసెంబర్ 1976న నెల్లూరు జిల్లాలో జన్మించిన **వెంకట్ శిద్దారెడ్డి** మొదటి కథ *ఒక ప్రేమ కథ* 10 అక్టోబర్ 2004 నవ్య వీక్లీలో అచ్చయ్యింది. ఇరవై పైగా కథలు రాసారు. రెండు కథాసంపుటాలు- సోల్ సర్కస్, సినిమా కథలు, సినిమాల మీద మరో రెండు పుస్తకాలు ప్రచురించారు. సినిమాలు, సాహిత్యం మీద ఆసక్తితో విదేశాలలో చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదులుకొని, కొన్ని సినిమాలకు నిర్మాణ రంగంలో పనిచేసారు. అన్వీక్షికి ప్రచురణాలయం వ్యవస్థాపకుడు. ప్రస్తుతం చదువు అనే ఈ-బుక్ యాప్ తయారీలోనూ, ఓటీటీ కోసం వెబ్ సిరీస్ రూపకల్పనలోనూ ఉన్నారు. నివాసం హైదరాబాద్.

***ఫోన్: 98498 88773*** ***venkat.thedirector@gmail.com***